

అతలాకుతలం

8లో▸

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జన్నారం మండల ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. బర్దన్‌చెరువుకు బ్యాక్ వాటర్ హరిజన కాలనీలోకి చేరి నిరాశ్రయులయ్యారు.

మినీ జాబ్‌మేళా

పాతమంచిర్యాల: మంచిర్యాల ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 25న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ తెలిపారు. ఎల్ఐసీ ఆఫ్ ఇండియాలో రూరల్ కేరీర్ ఏజెంట్ 30 ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం ఎస్సెస్సీ ఆపై చదివిన వారు ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. 18–35 ఏళ్ల లోపువారు అర్హులని పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /25.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డీఆర్‌డీవో కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్

పాతమంచిర్యాల: నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ(డీఆర్‌డీవో) కార్యాలయాన్ని కలెక్టర్ బాదావత్ సంతోష్ శనివారం ప్రారంభించారు. మంచిర్యాలలోని గాంధీనగర్‌లో ఉన్న కార్యాలయాన్ని కలెక్టరేట్‌లోకి తరలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో బి.శేషాద్రి, అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీఎంలు, ఏపీఎంలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కవి రాజేశంకు సినారె పురస్కారం



కవి తోకల రాజేశం

నెన్నెల: మండలంలోని ఆవుడం గ్రామానికి చెందిన ప్రముఖ కవి, విమర్శకుడు, జిల్లా రచయితల వేదిక అధ్యక్షుడు తోకల రాజేశం డాక్టర్ సీ.నారాయణరెడ్డి రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 30న జడ్చర్లలో జరిగే కార్యక్రమంలో మహాకవి సినారె కళాపీఠం పురస్కారం ప్రదానం చేస్తారు. పద్య, వచన, కవిత్వంతోపాటు సాహిత్య విమర్శ రంగంలోనూ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు కళాపీఠం అధ్యక్షుడు మల్లెకేడి రాములు, సమన్వయకర్త డాక్టర్ పోరెడ్డి రంగయ్య ప్రకటించారు. రాజేశం 2006లో తెలుగు బాల శతకం, 2010లో చమట చుక్కలు, 2013లో పాతాళగరిగే, 2017లో అడవిదీపాలు, మంచిర్యాల జిల్లా సాహిత్య చరిత్ర అనే గ్రంథాలను ముద్రించారు. ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు.

'ఎల్లంపల్లి'పై వాహనాల రాకపోకలు నిషేధం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్టుపై వాహనాల రాకపోకలను పోలీసులు నిషేధించారు. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడం, గేట్లు ఎత్తి దిగువకు వదులుతుండడంతోపాటు గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నారు. ప్రాజెక్టు దిగువ ప్రాంతాల ప్రజలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ప్రాజెక్టు పై నుంచి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గోదావరి అవతలి వైపు ఉన్న గ్రామాలకు చెందిన ప్రజలు ఇవతలి వైపు ఉన్న ప్రాంతాలకు వివిధ రకాల పనులకు నిత్యం వస్తూ పోతుంటారు. గేట్ల ఎత్తివేత, గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నాలుగు రోజుల పాటు వాహన రాకపోకలు పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ ప్రకటించారు.

అభివృద్ధి పనులు పరిశీలన

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శనివారం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ పరిశీలించారు. ట్యాంక్‌బండ్, కేసీఆర్ పార్క్, నర్సరీలు, వైకుంఠధామం, మహిళా భవనం, కమ్యూనిటీ హాల్, తదితర పనులు పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కమిషనర్ గద్దె రాజు, డీఈ సుమతి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ప్రభాకర్, సిస్టం మేనేజర్ శిరీష్ ఉన్నారు.

చినుకుతో రోడ్లు ఛిద్రం

- దెబ్బతింటున్న గ్రామీణదారులు • కల్వర్టు, రోడ్డ్యాం, అప్రోచ్‌ల వద్ద తిప్పలు • తాత్కాలిక మరమ్మతులతోనే సరి • ప్రజా రవాణాకు తప్పని ఇబ్బందులు



ఇది నెన్నెల మండలం నార్వాయిపేట, గుండ్ల సోమారం గ్రామాల మధ్య ఉన్న రోడ్డు కల్వర్టు. ఇటీవల కురిసిన వర్షాలతో వచ్చిన వరదకు కల్వర్టు కింది భాగంలో మట్టి కొట్టుకుపోయింది. కల్వర్టుకు ఆధారంగా ఉండే చోట దెబ్బతినడంతో ప్రమాదం పొంచి ఉంది. మళ్లీ వర్షాలు ఉధృతమైతే మరింత ధ్వంసమయ్యే అవకాశం ఉంది. తీవ్రత అధికంగా ఉంటే మొత్తం కూలిపోయే ప్రమాదం ఉంది. వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇది వేమనపల్లి నుంచి మల్లంపేటకు వెళ్లే దారి. ఈ రోడ్డు గుండా నిత్యం అనేక గ్రామాలు, అటు మహారాష్ట్రకు రాకపోకలు జరుగుతుంటాయి. గతేడాది నుంచే ఇక్కడ కల్వర్టు ఇరువైపులా సమస్య ఉంది. స్లాబ్ వేసిన రోడ్డుకు గతంలోనే బుంగలు ఏర్పడ్డాయి. తాజాగా కురిసిన వర్షాలకు దెబ్బతినడంతో మరోసారి దారి గుండా ప్రయాణం నిలిచిపోయింది. అటు వెళ్లే వారు రోడ్డు కింద అడవిలో దిగి ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు ఇప్పటికే దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. త్వరితగతిన పనులు పూర్తి చేస్తేనే మళ్లీ వర్షాలు కురిస్తే ఇబ్బందులు ఉండవు.





ఇది దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణస్వామి దేవస్థానం వెళ్లే దారిలో ఉన్న ఘాట్ రోడ్డుకు రక్షణగా ఉన్న గోడ కూలిపోయింది. గుట్టపైకి వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ఘాట్ రోడ్డు దెబ్బతినడంతో మరమ్మతులు చేసే వరకు రోజువారీగా భక్తుల ప్రయాణానికి తిప్పలు తప్పవు. అంతేకాక వాహనాలు ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుంది.

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: చినుకు పడితే చింతే అన్నట్లుగా మారింది జిల్లాలో రోడ్ల పరిస్థితి. ఏటా వర్షాకాలంలో జిల్లాలో రోడ్లు దెబ్బతింటున్నాయి. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోని రోడ్లతోపాటు జాతీయ రహదారుల రోడ్లు సైతం పాడవుతున్నాయి. ఏటేటా మరమ్మతులు చేస్తూ నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ తిప్పలు తప్పడం లేదు. గతేడాది కురిసిన అధిక వర్షాలకు ప్రజా రవాణాకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. తాజాగా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లతోపాటు పట్టణాల్లోని రోడ్లు ఛిద్రమవుతున్నాయి. దీంతో ప్రజారవాణాకు ఆటంకం కలుగుతోంది. నిరుడు వానాకాలంలో ఆర్అండ్‌బీ పరిధిలో 38చోట్ల, పంచాయతీరాజ్ పరిధిలో 25 చోట్ల రోడ్లు దెబ్బతిన్నా యి. వీటిని మరమ్మతుల కోసం నివేదికలు పంపితే నిధులు ఆలస్యంగా విడుదలయ్యాయి. తాత్కాలిక మరమ్మతుల కోసమే నిధులు విడుదల కావడంతో అరకొరగా పనులు పూర్తి చేశారు. కొన్ని చోట్ల ఇంకా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మళ్లీ వానాకాలం సీజన్ రావడంతో వర్షాలు కురిస్తే మరోమారు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి.

తాత్కాలిక మరమ్మతులే..

ప్రతీ సీజన్‌లో కురుస్తున్న వర్షాలకు తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారు. ఇక కొన్ని చోట్ల ఆయా శాఖ అధికారులు స్పందించకున్నా స్థానికులు, పోలీసులు, ప్రజాప్రతినిధులే తమ సొంత ఖర్చులతో తక్షణ సాయం చేస్తున్నారు. ప్రయాణానికి ఇబ్బందులు పడకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక పట్టణాల్లో కూడా చిన్నపాటి వర్షానికే అంతర్గత రోడ్లు, ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. నీటితో నిండిపోతున్నాయి. ఎప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరోవైపు రోడ్లు దెబ్బతిన్న దారుల గుండా వెళ్లే ఆర్టీసీ బస్సుల సర్వీసులు నిలిపివేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారవాణాకు ఆటంకం కలుగుతోంది. ప్రస్తుతం జిల్లాలో పంచాయతీరాజ్ పరిధిలో మూడు చోట్ల, ఆర్అండ్‌బీ పరిధిలో రెండు చోట్ల మరమ్మతులు చేసే స్థాయిలో దెబ్బతిన్నాయని నివేదికలు పంపి, మరమ్మతులు చేయిస్తామని ఆర్అండ్‌బీ ఇన్చార్జి ఈఈ పెద్దన్న, పీఆర్ ఈఈ ప్రకాశ్ తెలిపారు.

సీఎంఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- రైస్‌మిలర్లతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: సీఎంఆర్ ప్రక్రియను తర్వగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌తో కలిసి జిల్లాలోని రైస్‌మిల్లర్ల యజమానులతో సీఎంఆర్ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎంఆర్ పూర్తి చేసేందుకు అధికారులు రైస్‌మిల్లర్ల సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. మిల్లు సామర్థ్యానికి అనుగుణంగా కేటాయించిన లక్ష్యాలను సాధించాలని, గత పది రోజుల్లో 3,883 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ పూర్తయిందని అన్నారు. మిగిలిన లక్ష్యాన్ని 2021–22 సంవత్సరానికి గాను వానాకాలానికి సంబంధించి 91,910మెట్రిక్ టన్నుల సీఎంఆర్ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 84,487మెట్రిక్ టన్నులు పూర్తయిందని పేర్కొన్నారు. యాసంగికి సంబంధించి 52,649 మెట్రిక్ టన్నులకు గాను 36,375 మెట్రిక్ టన్నులు పూర్తయ్యాయని తెలిపారు. 2022–23 సంవత్సరానికి గాను జిల్లాలోని 54 రైస్‌మిల్లులకు కేటాయించిన లక్ష్యంలో ఇప్పటివరకు 36.07శాతంతో 6,409మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ పూర్తయినట్లు చెప్పారు. ఒక రైస్‌మిల్లుకు కేటాయించిన లక్ష్యం పూర్తయితే పెండింగ్‌లో ఉన్న రైస్‌మిల్లు నుంచి ధాన్యం తీసుకొని వారికి కేటాయిస్తామని అన్నారు. అలసత్వం వహించిన రైస్‌మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, ఆర్డీవో వేణు, రైస్‌మిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు నల్మాసు కాంతయ్య, రైస్‌మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

వర్షాలకు ఆర్టీసీ బస్సులు బంద్

- కోతకు గురైన రహదారులు, దెబ్బతిన్న వంతెనలు
- విద్యాసంస్థలకు సెలవులు
- 18 బస్సులు నిలిపివేసిన యాజమాన్యం
- పడిపోయిన ఆదాయం
- మంచిర్యాల నుంచి చెన్నూర్ వరకే బస్సులు



ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో నిలిపి ఉంచిన బస్సులు

మంచిర్యాలఅర్బన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం ఆర్టీసీపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కోతకు రహదారులు, దెబ్బతిన్న వంతెనలతో యాజమాన్యం పలు గ్రామాలకు బస్సు రాకపోకలను నిలిపివేసింది. బురదమయమైన రోడ్లతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇంకోవైపు మూడు రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడం కూడా బస్సుల నిలిపివేతకు కారణమైంది. దీంతో గత మూడు రోజులుగా ఆదాయం అంతకంతకు పడిపోతోంది. ఇప్పుడిప్పుడే లాభాలబాట పడుతున్న ప్రగతి చక్రానికి వర్షాల ప్రభావం అడ్డంకిగా మారుతోంది.

రెండ్రోజులుగా..

వర్షాల వల్ల మంచిర్యాల డిపోకు చెందిన 18 బస్సులు రెండ్రోజులుగా నిలిపివేశారు. జగిత్యాలకు వెళ్లే బస్సులు అనంతారం వద్ద వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో 5నుంచి 10గంటల వరకు వేచి చూడాల్సిన పరిస్థితి. దీంతో ఐదు బస్సులు నడిచే చోట రెండింటితో సరిపెడుతున్నారు. నిజామాబాద్ వెళ్లే మూడు బస్సులు నిలిపివేశారు. మంచిర్యాల నుంచి చెన్నూర్ వరకు బస్సులు నడిపిస్తున్నారు. కోటపల్లి, వేమనపల్లి మండలాల్లోని మల్లంపేట, జనగాం, వెంచపల్లితోపాటు పలు గ్రామాల్లో కోతకు గురైన రహదారులతో బస్సులు నిలిపివేశారు. బురదమయైన రహదారితో దహెగాంకు నడిచే రెండు బస్సులు రద్దు చేశారు. నెన్నెల మండలం మైలారం బస్సు నిలిపివేశారు. విద్యాసంస్థలకు మూడు రోజులు సెలవు ప్రకటించడంతో విద్యార్థులను చేరవేసే బస్సులు తాత్కాలికంగా నిలిపివేశారు.

పడిపోయిన ఆదాయం..

మంచిర్యాల డిపోలో 147 బస్సులు ఉన్నాయి. రోజుకు 60వేల కిలోమీటర్ల మేర రాకపోకలు సాగిస్తుంటాయి. రోజుకు రూ.30లక్షల ఆదాయం సమకూరాల్సి ఉంటుంది. డిపో పరిధిలో ఈ నెల 19న రూ.24,31,481 ఆదాయం వచ్చింది. 60వేల కిలోమీటర్లు తిరగాలిస్న బస్సులు 2వేల కిలోమీటర్లు తగ్గిపోయాయి. ఈ నెల 20న బస్సులు 4వేల కిలోమీటర్లు తక్కువ తిరగడం వల్ల రూ.23,12,480 ఆదాయంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ నెల 21న 60 వేల కిలోమీటర్లు బస్సుల రాకపోకలు సాగించాల్సి ఉండగా 7వేల కిలోమీటర్లు తగ్గిపోయింది. డిపోలో రోజుకు రూ.30లక్షలు రావాల్సి ఉండగా రూ.18,14,649 ఆదాయంతో నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. రద్దు చేసిన బస్సులు రాకపోకలు సాగించాలంటే రోడ్లు మరమ్మతులు పూర్తి కావాల్సి ఉంది. బస్సుల రాకపోకలకు ఇంకా ఎన్ని రోజులు పడుతుందో తెలియకుండా పోతోందని ఓ అధికారి తెలిపారు.

తగ్గని గోదావరి వరద ఉధృతి

- పంటలకు పొంచి ఉన్న ముప్పు
- ఆందోళనలో రైతులు



జైపూర్: వేలాల వద్ద ఉధృతంగా గోదావరి నది

చెన్నూర్/జైపూర్: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెన్నూర్, జైపూర్ మండలాల్లో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షాలకు నీరు చేరడంతో నీటిమట్టం పెరుగుతోంది. శనివారం చెన్నూర్ గోదావరి నది ఒడ్డు వరకు నీరు చేరింది. నీటిమట్టం మరింత పెరిగితే పరీవాహక ప్రాంతంలో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది గోదావరి వరద ముంపుతో పత్తి పంటలు నీట మునిగాయి. జైపూర్ మండలం రొమ్మిపూర్ శివారులోని పార్వతి బ్యారేజీ 60 గేట్లు ఎత్తి 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. పై నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ద్వారా గేట్ల నుంచి నీరు వదలడంతో గోదావరి నిండుగా ప్రవహిస్తోంది. వేలాల పుష్కర ఘాట్ నీట మునిగింది.

ప్రాణహితనది..

వేమనపల్లి: భారీ వర్షాలకు వరద నీటితో ప్రాణహిత నది నిండుకుండలా ప్రవహిస్తోంది. వేమనపల్లి పుష్కరఘాట్ పూర్తిగా మునిగిపోగా రోడ్డుపైకి వరద చేరింది. రాచర్ల, ముల్కలపేట బొందచేను వంతెనల వద్దకు వరద నీరు ఆవరించింది. ఇప్పటికే వేమనపల్లి, రాచర్ల, ముల్కలపేట, జాజులపేట, కళ్లంపల్లి, సుంపుటం గ్రామాల్లోని సుమారు 200 ఎకరాల్లో పత్తి పంటలు నీటమునిగాయి. ఇంకా వరద ముంపు పొంచి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌కు భారీగా వరద నీరు చేరుతుండగా గేట్లు ఎత్తి గోదావరి నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను 16.830 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఇన్‌ఫ్లో 2 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 320 క్యూసెక్కులు, ప్రాజెక్ట్‌లోని 26 గేట్లు ఎత్తి 2.55 లక్షల క్యూసెక్కులు వదిలిపెడుతున్నారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య

- బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శనివారం బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాలలో ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభావంతులైన నలుగురు విద్యార్థులకు మంజూరైన నగదు ప్రోత్సాహకాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చిత్తశుద్ధితో అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల చెంతకు అంకిత భావంతో తీసుకెళ్తున్న అధ్యాపకుల కృషి అభినందనీయమని అన్నారు. గత విద్యాసంవత్సరంలో ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐకార్, ఏపీయూ వంటి ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో ఆకుదారి ఆనంద్‌కుమార్, మారవేణి సాయిరాజ్, షిండే విజ్ఞాన్, చాపిడి అజయ్ సీటు సాధించారు. వీరికి సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ రూ.1.05 లక్షల నగదు ప్రోత్సాహక బహుమతిని మంజూరు చేసింది. ఈ మేరకు విద్యార్థులకు చెక్కు రూపేణా అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ సైదులును శాలువాతో ఎమ్మెల్యే సన్మానం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్ ఆస్మా బేగం, వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, జేవీపీ కె.రాజేశ్వర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పేరిట ప్రభుత్వం మోసం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్
- డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన



నిర్మాణం నిలిచిన ఇళ్లు పరిశీలిస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో పేదలను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో నిర్మాణం నిలిచిపోయిన, నిర్మాణాలు పూర్తి చేసినా పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను పార్టీ ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు దాటినా ఇళ్లు ఇవ్వకపోవడం శోచనీయమని అన్నారు. ఆరు నెలల క్రితం లాటరీ పద్ధతిలో 330 మందికి ఇళ్లను కేటాయించినా ఇప్పటివరకు అప్పగించలేదని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా మోదీ ప్రభుత్వం దేశమంతటా ఇళ్లు కట్టిస్తుంటే, రాష్ట్ర ప్రజలు ఇళ్లకు నోచుకోవడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకులు అందుగుల శ్రీనివాస్, బోయిని హరికృష్ణ, ముదాం మల్లేశ్, పట్టి వెంకటకృష్ణ, బల్ల రవి, పచ్చ వెంకటేశ్వర్లు, సత్రం రమేశ్, ఆకుల సంతోశ్, దాస్య నాయక్, కొట్టి నాగేశ్వర్ రావు, బండి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వరద సాయానికి కంట్రోల్ రూమ్

మంచిర్యాలటౌన్: జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వరదలు వచ్చే అవకాశం ఉన్నందున, మంచిర్యాల పట్టణ ప్రజలకు అత్యవసర సేవల నిమిత్తం మంచిర్యాలలో కంట్రోల్ రూం(హెల్ప్ సెంటర్)ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 24 గంటల పాటు ముగ్గురు ఉద్యోగులు యండి.ఇర్ఫాన్, యండి.హుస్సేన్, సుదర్శన్ 9849907866 నంబరులో అందుబాటులో ఉంటారని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు, వరదల నుంచి ముప్పు ఉన్నవారు టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి, సమాచారం అందించి, అత్యవసర సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు

పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి

జన్నారం: వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసి పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని పొనకల్, జన్నారం, రేండ్లగూడ గ్రామాల్లో ఆయన పర్యటించారు. అపరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది సమ్మెలో ఉన్నారనే సాకు చూపించకుండా పనులపై దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా నిల్వ చేసుకోవాలని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, బ్లీచింగ్ పౌడర్ వేయడం, ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రమేశ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నెత్తురోడుతున్న నేషనల్ హైవే

- 45 రోజుల్లో నలుగురు మృతి
- అతివేగంతోనే రోడ్డు ప్రమాదాలు
- అవగాహన కల్పించడంలో హైవే అధికారుల విఫలం



ఈ ఫొటోలో కనిపిస్తున్న రోడ్డు ప్రమాదం శుక్రవారం తాండూర్ మండలం బోయపల్లి బోర్డు వద్ద జరిగింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న పోశం అనే వ్యక్తిని వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అతడు కారు బానెట్‌పై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దృశ్యం కారు వేగాన్ని ప్రస్ఫుటం చేస్తోంది.

బెల్లంపల్లి: 363 జాతీయ రహదారిపై జరుగుతున్న వరుస ప్రమాదాలు వాహన చోదకుల ప్రాణాలు బలి తీసుకుంటున్నాయి. బెల్లంపల్లి ప్రాంతంలో జాతీయ రహదారిపై వరుసగా రెండురోజులు రోడ్డు ప్రమాదాలు జరగగా ఇద్దరు మృతి చెందిన సంగతి తెలిసిందే. అంతకుముందు శ్రీరాంపూర్ రింగ్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చనిపోయారు. మందమర్రి బైపాస్, సోమగూడెం చర్చి వద్ద లారీ అదుపుతప్పి బోల్తా పడగా తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఇలా మంచిర్యాల జిల్లా పరిధిలో 45 రోజుల వ్యవధిలో నాలుగు ప్రమాదాలు జరిగి నలుగురు మృత్యువాత పడ్డారు. మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. గురువారం తాండూర్ మండలం బోయపల్లి బోర్డు వద్ద వేగంగా వచ్చిన లారీ రోడ్డు మీదుగా ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న అల్లకొండ పోశం (50) అనే భవన నిర్మాణ కార్మికుడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మరువకముందే శుక్రవారం కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధి జాతీయ రహదారిపై మరో ప్రమాదం జరిగింది. బైక్‌పై రజిత (40), తిరుపతి దంపతులు బెల్లంపల్లికి వెళ్తుండగా మందమర్రి వైపు నుంచి వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రజిత అక్కడికక్కడే చనిపోగా తిరుపతి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అంతకుముందు బుధవారం రాత్రి బెల్లంపల్లి కన్నాల బస్తీ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద కారు–బైక్ ఢీకొని జాడి రాజ్‌కుమార్ (35) మృతి చెందాడు. బట్టి మోహన్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీరాంపూర్, బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట ప్రాంతాల్లో వరుస రోడ్డు ప్రమాదాలు జరిగి వాహన చోదకుల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

అజాగ్రత్త, అతివేగంతోనే..

మంచిర్యాల–చంద్రాపూర్ వరకు నాలుగులేన్ల జాతీయ రహదారి నిర్మించారు. దీంతో వాహనాలు సామర్థ్యానికి మించిన వేగంతో వెళ్తున్నాయి. పైగా అజాగ్రత్తతో నడుపుతుండగా ప్రమాదాలు జరుగుతున్నాయి. తాండూర్ మండలం బోయపల్లి బోర్డు వద్ద, కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాలు మితిమీరిన వేగంతోనే జరిగినట్లు తెలుస్తోంది. శ్రీరాంపూర్ రింగ్‌రోడ్డు సరిగా లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు డ్రైవర్లు పేర్కొంటున్నారు. భారీ వాహనాలు కూడా స్పీడ్‌గా వెళ్తుండడంతో అనూహ్యంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. డ్రైవర్ల స్వయం కృతాపరాధంతోపాటు సరైన సూచికలు లేకపోవడం.. అవగాహన లేమితోనూ ప్రమాదాలు జరుగుతున్నట్లు చర్చించుకుంటున్నారు. జాతీయ రహదారిపై జెట్ స్పీడ్‌తో వాహనాలు దూసుకెళ్తుండడంతో అమాయకులు రోడ్డు ప్రమాదానికి గురై అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు.

అవగాహన కల్పించని అధికారులు

సాంకేతిక లోపంతోనో.. మరే కారణంతోనో రోడ్డుప్రమాదాలు జాతీయ రహదారిని రక్తసిక్తం చేస్తున్నాయి. వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా నేషనల్ హైవే అధికారులు పట్టించుకోవడంలేదు. వాహనాలు అతివేగంగా వెళ్తున్నా మిన్నకుండి పోతున్నారు. మూల మలుపుల వద్ద, రోడ్డు క్రాస్ చేసే క్రమంలో తీసుకునే జాగ్రత్తలపై పాదచారులు, వాహనదారులకు అవగాహన కల్పించడంలేదు. వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టక పోవడం కూడా మరో కారణంగా చెప్పుకొంటున్నారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు, ప్రమాదకరమైన ప్రాంతాల్లో ముందు జాగ్రత్తగా రోడ్డు పక్కన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉండగా నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి. కాగా, ప్రమాదం జరిగిన తర్వాత క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచడంలేదు. క్షతగాత్రులను సకాలంలో సమీప ఆస్పత్రులకు తీసుకువెళ్లడానికి అంబులెన్స్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంచడం లేదనే ఆరోపణలున్నాయి. రద్దీగా మారుతున్న జాతీయ రహదారిపై ఇకనైనా రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

ఓసీపీలో కార్మికులతోనే బొగ్గు తీయించాలి



వినతిపత్రం ఇస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో సింగరేణి కార్మికులతోనే బొగ్గును వెలికితీసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు ప్రాజెక్టు అధికారి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు వెలికితీయాల్సిన బొగ్గును ప్రైవేటు ఓబీ కాంట్రాక్టర్‌తో తీయించడం దుర్మార్గమన్నారు. టీబీజీకేఎస్, ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యం ఇచ్చే ఉచిత మస్టర్లకు ఆశపడి 30 ఏళ్లు నడవాల్సిన గోలేటి, గోలేటి–1ఏలు మూతపడేలా చేశారని ఆరోపించారు. టీబీజీకేఎస్ చేతకానితనంతోనే ఏరియా ఎక్స్‌ప్లోరేషన్ డిపార్టుమెంట్‌ను సైతం మూసివేశారన్నారు. ఏరియాలో ప్రస్తుతం నడుస్తున్న ఏకైక ఓసీపీని సైతం ప్రైవేటు వారికి అప్పగించి బెల్లంపల్లి ఏరియానే లేకుండా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఏరియాకు హైకెపాసిటీ మిషనరీ, డంపర్లు, లోడర్లు, శావల్స్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి రమేశ్, నాయకులు శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, పెండెం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఆత్మహత్య



లింగయ్య మృతదేహం

దండేపల్లి(మంచిర్యాల): పురుగుల మందు తాగి పారిశుధ్య కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కుందారపు ప్రసాద్ తెలిపారు. తానిమడుగు గ్రామానికి చెందిన మోతె లింగయ్య (34) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతని భార్య జన్నారం మండలం రాంపూర్‌లోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నెల 21న మద్యం మత్తులో గడ్డిమందు తాగాడు. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం ముందుగా లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్సై

తాండూర్: మండలంలోని బెజ్జాలకు చెందిన మోతిరాం ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. మాదారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శనివారం సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రాజశేఖర్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడికి ఫోన్ అప్పగించారు.

పిచ్చికుక్కల స్వైరవిహారం



గాయపడిన ప్రవళిక



గాయపడిన మనోజ్

దహెగాం(సిర్పూర్): మండలంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. శనివారం ముగ్గురు చిన్నారులపై దాడిచేసి గాయపరిచాయి. రాళ్లగూడకు చెందిన రోహిణి ప్రవళిక అమ్మమ్మ ఊరైన ఇట్యాలలో ఇంటిముందు ఆడుకుంటుండగా కుక్క దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఐనం గ్రామానికి చెందిన నక్క హరీశ్ సరుకుల కోసం కిరాణ దుకాణానికి వెళ్తుండగా కుక్కదాడి చేసి చేతికి గాయాలయ్యాయి. అదే గ్రామానికి చెందిన జుమ్మిడి మనోజ్ ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్క దాడికి పాల్పడింది. గాయపడ్డ వారికి దహెగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తప్పిపోయిన బాలుడు అప్పగింత



బాలున్ని అప్పగిస్తున్న ఎస్సై రవికుమార్

నస్పూర్: మంచిర్యాల పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన మేకల భూమక్క–శంకరయ్య దంపతుల కుమారుడు వరుణ్ శనివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. నస్పూర్‌లోని కలెక్టరేట్ భవనం సమీపంలో రోదిస్తుండగా స్థానికుల సమాచారం మేరకు సీసీసీ నస్పూర్ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడు ఎలాంటి వివరాలు చెప్పకపోవడంతో ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వాటి ఆధారంగా తల్లి భూమక్క పోలీస్ స్టేషన్‌కు రావడంతో బాబును అప్పగించినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

అటవీప్రాంతంలో కూలిన కల్వర్టు



కల్వర్టును పరిశీలిస్తున్న జైపూర్ ఏసీపీ మోహన్



అడవిలోంచి కాలినడకన వెళ్తున్న ప్రయాణికులు

- 35 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

వేమనపల్లి(బెల్లంపల్లి): మండలంలోని నీల్వాయి–మల్లంపేట అటవీ ప్రాంతంలో గతేడాది కోతకు గురైన స్లాబ్ కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. దీంతో మండల కేంద్రంతో పాటు 35 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అక్కడి వరకూ ప్రైవేట్ వాహనాల్లో వెళ్లిన ప్రయాణికులు నాలుగు కిలోమీటర్ల దూరం కాలినడకన మల్లంపేటకు చేరుకుంటున్నారు. సర్పంచ్ గాలి మధు, ఎంపీటీసీ సంతోష్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ కుబిడె వెంకటేశం ఆర్అండ్‌బీ అధికారులకు సమాచారం అందించడంతో నీల్వాయి ఎస్సై సుబ్బారావు కల్వర్టు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సైలు సుబ్బారావు, సురేష్ కల్వర్టును సందర్శించారు. రెండు రోజుల్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టనున్నట్లు చెన్నూర్ సబ్‌డివిజన్ ఆర్అండ్‌బీ ఈఈ పెద్దన్న, డీఈ రమేశ్ తెలిపారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ఆటో

- ఆరుగురికి గాయాలు
- మొరాయించిన 108
- 102లో క్షతగాత్రుల తరలింపు



క్షతగాత్రులను 102 లోకి మారుస్తున్న దృశ్యం

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్–కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై శనివారం ఉదయం ఆటో అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఎస్సై కొమురయ్య, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెంచికల్‌పేట్ నుంచి ఆరుగురు ప్రయాణికులతో ఆటో డ్రైవర్ ఒల్లాల సత్యనారాయణ కాగజ్‌నగర్‌కు బయలు దేరిన కొద్ది నిమిషాల్లోనే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి చెట్టును ఢీకొట్టాడు. దీంతో ఆటోలో ఉన్న ముక్తార్ హైమద్, కోలి సునీత, కళావతి, మల్యాల లక్ష్మి, పందిర్ల బాపులకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రులను పోలీసు వాహనంలో పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక వైద్యచికిత్స అందించారు. అనంతరం బాధితులను 108లో తీసుకెళ్తుండగా అంబులెన్స్ మొరాయించడంతో 102 వాహనంలో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య సఫోరా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య



మన్విత్ (ఫైల్)

నస్పూర్: జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని సుందరయ్యకాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం కాలనీలో నివాసం ఉండే సంఘం కుమారస్వామి కుమారుడు మన్విత్(21) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. పదిరోజుల క్రితం తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. అప్పటి నుంచి ఇంట్లో ముభావంగా ఉంటున్నాడు. శనివారం తెల్లవారు జామున కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి ఇంట్లో పైపుకు చీరతో ఉరేసుకుని కనిపించాడు. కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యే చిన్నయ్యకు లీగల్ నోటీసు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు లీగల్ నోటీసు పంపించినట్లు కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపల్లి ఉదయ్‌కాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా ఎమ్మెల్యే చిన్నయ్య ఇటీవల స్థానిక లోకల్ ఛానళ్లు, మీడియా సమావేశంలో చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని లీగల్ నోటీసులో స్పష్టం చేశారు. లేనిపక్షంలో ఎమ్మెల్యేపై కోర్టులో పరువు నష్టం దావా వేస్తానని ఆయన పేర్కొన్నారు.

జాబితా లీకేజీ వ్యవహారంలో ఇద్దరిపై కేసు

ఆసిఫాబాద్‌రూరల్: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న లక్ష రూపాయలకు సంబంధించి తయారు చేసిన జాబితాను ముందస్తుగా బహిర్గతం చేశారని కలెక్టర్ ఫిర్యాదు మేరకు బీసీ సంక్షేమ శాఖలో పని చేస్తున్న ప్రణయ్, ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఐటీ యాక్ట్ 120 బీ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఒకరిపై కేసు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన మార్కెట్ ఏరియా (ఆర్కె రోడ్డు)కు చెందిన యూట్యూబ్ రిపోర్టర్ సర్ఫరాజ్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ బుద్దే స్వామి, ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. బ్యూటీపార్లర్ నిర్వహిస్తున్న మహిళకు సర్ఫరాజ్ పలుమార్లు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడటంతో పాటు ఆమె ఇంటిచుట్టూ తిరుగుతూ భయాందోళనకు గురి చేసినట్లు బాధిత మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వారు పేర్కొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం శనివారం పట్టణంలోని రెండు కేంద్రాల్లో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జవహర్ నవోదయ విద్యాలయం, సెయింట్ క్లారెట్ పాఠశాలల్లో రెండు సెంటర్లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 719 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 152 మంది మాత్రమే హాజరయ్యారు. 567 మంది గైర్హాజరయ్యారు.

ఉత్పత్తి లక్ష్యసాధనలో ముందుండాలి



గనిలోకి దిగుతున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): వార్షిక ఉత్పత్తి లక్ష్యసాధనలో ఎస్ఆర్పీ 3, 3ఏ గనులు ముందుండాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్, ప్లానింగ్) జీ.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కార్పొరేట్ జీఎం (సేఫ్టీ) గురువయ్య, ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి గనిలోకి దిగి పని స్థలాలను పరిశీలించారు. 3 ఎస్పీ, 2 డిస్ట్రిక్ట్‌లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం గని వార్షిక ఉత్పత్తి లక్ష్యం 2.8 లక్షలుకాగా వచ్చే ఏడాది నుంచి 4.4 లక్షలకు పెంచనున్నట్లు తెలిపారు. ఉత్పత్తి లక్ష్య సాధనకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అధికారులను అడిగి గనిలో తీసుకుంటున్న రక్షణ చర్యల గురించి తెలుసుకున్నారు. ఉద్యోగులంతా వ్యక్తిగత రక్షణ పరికరాలు ధరించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ రక్షణ నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం హరినారాయణ, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఏజెంట్ గోపాల్‌సింగ్, గని మేనేజర్ సంతోష్, ఇన్‌చార్జి రక్షణాధికారి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి క్రీడాకారుల సన్మానం



నిత్యశ్రీని సన్మానిస్తున్న క్రీడాకారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలం తాళ్ల గురిజాలకు చెందిన సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు గోగుల రాజన్న చిన్న కుమార్తె నిత్యశ్రీ జేఈఈ అడ్వాన్స్‌డ్ జాతీయస్థాయి పరీక్షలో 183వ ర్యాంకు సాధించి ఐఐటీలో సీటు దక్కించుకుంది. సహచర క్రీడాకారుడి కుమార్తె ఐఐటీలో సీటు సాధించడంపట్ల వాలీబాల్ క్రీడాకారులు విద్యార్థిని శాలువాతో సత్కరించారు. పట్టుదలతో ఉన్నతంగా చదివి ప్రయోజకురాలు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు వంగ రాము, గోనె గంగారం, తదితరులు పాల్గొన్నారు.

29న బహిరంగసభ విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఓదెలు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) ఆరవ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈ నెల 29న కొత్తగూడెంలో జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని ఆసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు కోరారు. శుక్రవారం గోలేటి ఎక్స్‌రోడ్ వద్ద టీటీసీ కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులతో కలిసి 'చలో కొత్తగూడెం' కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి కార్మికులకు చేసింది శూన్యమన్నారు. జేబీసీసీఐలో చేసిన నిర్ణయాలను సింగరేణిలో అమలు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఫలితంగా కాంట్రాక్టు కార్మికుల జీతాలు, జీవితాల్లో ఎలాంటి మార్పురావడం లేదన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన ఒప్పంద అంశాలను ఇప్పటి వరకూ అమలు చేయడం లేదన్నారు. ప్రతినెలా 7లోగా వేతనాలు చెల్లించాలని సర్క్యులర్ ద్వారా స్పష్టమైన ఆదేశాలున్నా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో జరగబోయే రాష్ట్ర మహాసభలను కార్మికులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'టీచర్ల సర్దుబాట్లను రద్దు చేయాలి'

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల సర్దుబాట్లను రద్దు చేయాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పత్తి సత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ వేమనపల్లిలో పనిచేస్తున్న ఎస్జీటీని నస్పూర్‌కు, కన్నెపల్లిలో పనిచేస్తున్న ఎస్జీటీని కోటపల్లికి కేటాయించటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. సమావేశంలో టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, సహ అధ్యక్షుడు చిన్నయ్య, ఆర్థిక కార్యదర్శి తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి గాజుల తిరుపతి, గౌరవ అధ్యక్షుడు మురళీమోహన్ పాల్గొన్నారు.

సర్దుబాట్లను వెనక్కి తీసుకోవాలి


మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఉపాధ్యాయ వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరిట చేపట్టిన అక్రమ సర్దుబాట్లను వెనక్కి తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేశ్, జయకృష్ణ డిమాండ్ చేశారు. జిల్లాలో ఆరుగురు టీచర్ల అక్రమ సర్దుబాటు జరిగినట్లు సమాచారం ఉందన్నారు. అవకతవకలపై ఆర్జేడీ, డీఎస్సీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

అతలాకుతలం



బొమ్మెన సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం

జన్నారం: మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జనం అతలాకుతలం అవుతున్నారు. కొత్తపేట చెరువుకు గండిపడి నీరు బర్తన్ చెరువులోకి వెళ్తోంది. బర్తన్ చెరువు బ్యాక్ నీరు హరిజన కాలనీలోకి చేరడంతో కాలనీవాసులు సామగ్రితో బయటకు పరుగులు తీశారు. కొత్తపేట, కవ్వాల్‌కు వచ్చే రహదారిపై నుంచి చెరువు నీరు పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాగు ఉప్పొంగడంతో బుడుగ జంగాల కాలనీలోకి నీరు చేరింది. తహసీల్దార్ కిషన్, సర్పంచ్ జక్కు భూమేశ్ సిబ్బంది బాధితులకు పునరావాసం కల్పించారు. శ్రీలంక కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. రోటిగూడకు వెళ్లే దారిలో రొడ్డాంపై నుంచి నీరు పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పొనకల్‌లో వీరాచారి, వెంకట్‌లకు చెందిన ఇళ్లు కూలిపోయాయి. పలు గ్రామాల్లో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.



కవ్వాల్ ఎస్సీకాలనీలో చేరిన వరదనీరు



కొత్తపేట చెరువు తెగి వృథాగా పోతున్న నీరు



పొనకల్‌లో వర్షానికి కూలిన ఇల్లు



బుడుగ జంగాలకాలనీలోకి చేరిననీరు

'బేటీ పడావో బీజేపీ ఆర్ఎస్ఎస్‌కు హటావో'

పాతమంచిర్యాల: 'బేటీపడావో బీజేపీ ఆర్ఎస్ఎస్‌కు హటావో' అని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంవీ గుణ అన్నారు. మణిపూర్ లో మహిళలపై జరిగిన హత్యాచార ఘటనపై శనివారం జిల్లా కేంద్రంలోని ఐబీచౌరస్తాలో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా మహిళా కన్వీనర్ బొడ్డు వినోద, నియోజకవర్గ ఇన్‌చార్జి బద్రి శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జులు జాగిరి రాజేశ్, కాదాసి రవీందర్, నాయకులు కిరణ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుర్రం నరసింహారెడ్డి

మంచిర్యాలటౌన్: క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుర్రం నరసింహారెడ్డిని నియమిస్తూ క్రెడాయ్ రాష్ట్ర శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మంచిర్యాల పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీకి చెందిన నరసింహారెడ్డికి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలను అప్పగించడంపై జిల్లా క్రెడాయ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.